క్లుప్తంగా

నేడు గురుపౌర్ణమి వేడుకలు



గురుపౌర్ణమికి సిద్ధం చేసిన షిరిడిసాయి మందిరం

వాల్మీకిపురం: స్థానిక షిరిడిసాయి నగర్‌లో వెలసిన షిరిడిసాయి బాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, షిరిడిసాయి చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. ఉదయం స్వామివారికి కాగడహారతి, జలాభిషేకం, పంచామృతాభిషేకం, సామూహిక సత్యనరాయణస్వామి వ్రతం, మధ్యాహ్న హారతి, ధూప్ హారతి, పల్లకిసేవ, శేజ్ హారతి సేవలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం 12:30 గంటలకు స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద ఉన్న సాయి నారాయణ సేవ భవనం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని, బాబా కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు



ప్రత్యేక బస్సులను ప్రారంభిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : అరుణాచలం (తిరువణ్ణామలై) గిరి ప్రదక్షణలకు పీలేరు నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు తరలివెళ్లినట్లు డీఎం కుమార్ తెలిపారు. శనివారం ఉదయం స్థానిక బస్టాండ్ ఆవరణలో బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం నాలుగు ప్రత్యేక బస్సులను పంపినట్లు తెలిపారు. ప్రతి పౌర్ణమికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐ సుబ్బమ్మ, బస్టేషన్ మేనేజర్ బాబునాయక్, రమణ, ప్రమీల పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

బి.కొత్తకోట: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శనివారం సాయంత్రం మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి తనిఖీ చేశారు. స్టేషన్‌లో కేసుల నమోదు, వాటి పరిష్కారం, నిందితుల అరెస్ట్, నాన్ బెయిలబుల్ పెండింగ్ వారెంట్లపై సమీక్షించారు. బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతల విషయంలో నిర్లక్ష్యం వహించరాదని సిబ్బందికి సూచించారు. పలు రికార్డులను పరిశీలించారు. సీఐ సూర్యనారాయణ వివరాలు తెలియజేశారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయలు

మదనపల్లె: రెండు ద్విచక్రవాహనాలు ఎదురు ఎదురుగా ఢీకొని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ములకలచెరువు మండలం పెద్దపాళెం గ్రామానికి చెందిన ఉమామహేశ్వర్ ద్విచక్రవాహనంలో వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చి తిరిగి వెళుతుండగా తంబళ్లపల్లె మండలం బాలిరెడ్డిగారిపల్లె పంచాయతీ దొడ్డకాడపల్లెకు చెందిన గోవర్ధన్ (21) మరో ద్విచక్రవాహనంలో ఎదురుగా వచ్చి ఎదురుగా ఢీ కొన్నాడు. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి 108 అంబులెన్స్ వాహనంలో తరలించారు.

మట్టి వినాయక విగ్రహాలు వినియోగించాలి

తంబళ్లపల్లె: వినాయకపండగ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని తహసీల్దార్ బ్రహ్మయ్య కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వినాయక బొమ్మల అమ్మకందార్లు, పండగకు వినాయవిగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. పీఓపీతో తయారు చేసిన విగ్రహాలను వినియోగించడం వల్ల కలిగే అనర్థాలు, పర్యావరణ ముప్పు తదితర అంశాలపై వివరించారు. ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను వాడే విధంగా వీఆర్‌ఓలు ప్రజలను చైతన్యపరచాలన్నారు.

లక్ష్మీనరసింహుడికి పూజలు



గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి విశేషపూజలు చేశారు. శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు.

వారి మోము మెరవాలని..!

- 50 మందికిపైగా కేశాలు దానం
- హెయిర్ డొనేషన్‌కు మంచి స్పందన



కేశాలు దానం చేసిన చిన్నారులతో హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్దిక్ (ఫైల్)

మదనపల్లె సిటీ: కేన్సర్ చికిత్స మూలంగా శిరోజాలు మొత్తం ఊడిపోయి న్యూనతాభావం, మనోవ్యాధితో కుంగిపోతున్న మహిళలకు హెల్పింగ్‌మైండ్స్ మహిళలకు అండగా నిలుస్తున్నారు. కోల్పోయిన సౌందర్యాన్ని తిరిగి పొందడానికి మదనపల్లెకు చెందిన హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో ఉచితంగా నిపుణులైన వైద్యులచే కౌన్సెలింగ్ చేయిస్తున్నారు. దాతల నుంచి శాస్త్రీయ పద్ధతిలో సేకరించిన శిరోజాలతో ఆరోగ్యప్రదమైన, నాణ్యమైన విగ్గులు తయారు చేయించి అందజేస్తున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ఇబ్బంది పడుతున్న కేన్సర్ పెషెంట్లకు ప్రధాన సమస్య జుత్తు ఊడిపోవడం. దీని వలన వారిలో మానసిక స్థైర్యం దెబ్బతింటుంది. తెలియని ఆందోళనకు లోనవుతారు. వీరి మోమున చిరునవ్వులు పూయించడానికి హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో 2022 ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకుని హెయిర్ డొనేషన్ క్యాంపునకు శ్రీకారం చుట్టారు. స్వచ్ఛందంగా ఇప్పటికి 50 మందికిపైగా హెయిర్ డొనేషన్ చేశారు.

ఆవేదన తీర్చేందుకు ప్రయత్నిస్తున్నా

కీమోథెరపీ వలన జుత్తు ఊడిపోవడంతో చాలా మంది మహిళలు కుంగిపోయి మానసిక ఆవేదన పొందుతున్నారు. మా సంస్థ ద్వారా ఎందరో మహిళలు,విద్యార్థులు వచ్చి కేశాలు అందజేస్తున్నారు. వాటిని విగ్గులు గా తయారు చేసి కేన్సర్ పేషంట్లకు అందిస్తున్నాం. వారి ఆవేదన కొంత వరకైనా తీర్చేందుకు ప్రయత్నిస్తున్నాం.

-అబూబకర్ సిద్దిక్, హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు,మదనపల్లె

ఆనందంగా ఉంది



కేన్సర్ పేషెంట్లకు శిరోజాలను ఇవ్వడం ఎంతో ఆనందం అనిపించింది. మూడు, నాలుగు నెలల్లో నా జుట్టు తిరిగి వచ్చేస్తుంది. ఇలా ప్రతి ఒక్కరు ఇవ్వడానికి ముందుకు రావాలి. విద్యార్థులందరూ వారి వంతుకుగా సాయం చేయడానికి ముందుకు రావాలి. -జోషిత, విద్యార్థిని

నా స్నేహితులతో పాటు ఇచ్చాం



నేను స్వచ్ఛందంగా కేశాలు దానం చేశాను. విద్యార్థులకు జడ ఎంతో ముఖ్యం. అయినప్పటికీ మా స్నేహితులంతా వారి కేశాలను ఇవ్వడం చూసి నాకూ ఇవ్వాలన్పించింది. పొడుగాటి జుట్టును కత్తిరించి ఇచ్చేశాను.

-విహాసిని, మదనపల్లె

నా వంతు సహాయం



మహిళలకు కురులే అందం. కీమోథెరపీ వలన కురులను కోల్పోయి నిస్సారమైన జీవితాన్ని గడుపుతున్న ఎందరో మహిళలకు నా వంతు సాయం చేస్తున్నా. నేను ఉచితంగా హెయిర్ కట్ చేసి సేవలు అందిస్తున్నా.

-విజయలక్ష్మి, బ్యూటీషియన్

మట్టి గణపతిని పూజిద్దాం



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ భానుప్రసాద్, పక్కన ఆర్డీఓ హరిప్రసాద్

-ఆర్డీఓ హరిప్రసాద్

మదనపల్లె సిటీ: పర్యవరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజిద్దామని మదనపల్లె ఆర్డీఓ హరిప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో మట్టి గణపతి విగ్రహాల వాడకంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ వినాయచవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. పీఓపీ విగ్రహాలు వాడకుండా మట్టి వినాయకుని ప్రతిమలు పెట్టి పూజలు చేసుకోవాలన్నారు. కృత్రిమ రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల పర్యావరణం దెబ్బతింటుందన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు మట్టి విగ్రహాలపై వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుప్రసాద్, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక మదనపల్లె మండలం బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మట్టి వినాయకుని ప్రతిమలను వాడాలని కోరుతూ కరపత్రాలు, అవగాహన కార్యక్రమం జరిగింది. పర్యావరణహిత మట్టితో తయారు చేసిన విగ్రహాలకు పూజలు చేయాలని హెచ్‌ఎం శ్రీనివాసులు తెలిపారు. మండలంలో సచివాలయాల్లో మట్టి వినాయకుని వాడకంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

నవోదయ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం వలసపల్లె వద్దనున్న జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ టి.వేలాయుధన్ తెలిపారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి సెప్టెంబర్ 16 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 18న నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియకు వెబ్‌సైట్‌ను నవోదయా యాప్‌ను సందర్శించాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న దరఖాస్తులను మాత్రమే నవోదయ విద్యాలయ సమితి అనుమతిస్తారన్నారు. విద్యార్థి, తలిదండ్రులు నివాసం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అయి వుండాలన్నారు. విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ 1.5.2013 నుంచి 31.7.2015 (రెండు తేదీలు కలుపుకుని) మధ్య జన్మించి ఉండాలన్నారు. 3, 4 తరగతలు చదివిన పాఠశాలలు, 5వతరగతి చదువుతున్న పాఠశాల ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్, ఎన్ఐఓఎస్, గుర్తింపు పొంది ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే ముందు వెబ్‌సైట్‌లో ఇచ్చిన సూచనలు తెలుసుకోవాలన్నారు.

సబ్‌స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్లు నైపుణ్యం పెంచుకోవాలి



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఏడీఈ బాబు

మదనపల్లె సిటీ: విద్యుత్‌శాఖ పరిధిలో పనిచేసే సబ్‌స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్లు నైపుణ్యాలను పెంచుకోవాలని విద్యుత్‌శాఖ ఏడీఈ బాబు అన్నారు. శనివారం స్థానిక గొల్లపల్లిరోడ్డులని శేషసాయి కల్యాణ మండపంలో మదనపల్లె విద్యుత్‌శాఖ పరిధిలోని సబ్‌స్టేషన్ల షిఫ్ట్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు షిఫ్ట్ ఆపరేటర్లు విధి నిర్వహణలో సబ్‌స్టేషన్‌లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. తరచూ తనిఖీలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈలు సురేంద్రనాయక్, రుక్మాంగదబాబు, ప్రొడక్షన్ ఏఈ అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి



ఉపాధి పనులు పరిశీలిస్తున్న పీడీ మద్దిలేటి

తంబళ్లపల్లె: ఉపాధిహామీ పనులు వేగవంతం చేయాలని ఉపాధిహామీ పథకం జిల్లా పీడీ మద్దిలేటి ఆదేశించారు. శనివారం మండలంలోని కుక్కరాజుపల్లెలో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. రైతు గంగులప్ప పొలంలో ఏర్పాటు చేస్తున్న ఫాంపాండ్ పనులను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలు, పూల తోటలు, పశుగ్రాసం పెంపకం వంటి పనులకు ప్రాధాన్యత కల్పించి రైతులను చైతన్యపర్చాలన్నారు. కూలీలకు కోరిన వెంటనే పనులను చూపి జరిగిన పనులు కొలతలు తీసి సకాలంలో బిల్లులు చెల్లించేందుకు చొరవ చూపాలన్నారు. ఆయన వెంట ఏపీడీ మధుబాబు, ఉపాధి ఇంజినీర్ రామన్న, టీఏలు శేఖరమ్మ, వెంకటరమణ, నాగార్జున, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నడకతో మెరుగైన ఆరోగ్యం

– ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



వాక్‌థాన్ ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె సిటీ: ప్రతి ఒక్కరూ ఉదయం వాకింగ్ అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శనివారం స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్ద సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వస్థ ఆస్పత్రిచే వాక్‌థాన్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. మారుతున్న కాలానుగుణంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. డాక్టర్ల సూచనల ప్రకారం మార్నింగ్ వాకింగ్ చేయాలన్నారు. జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్, స్వస్థ ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ డైలీ వేజెస్ వర్కర్స్ నూతన కార్యవర్గం

మదనపల్లె: మున్సిపల్ కాంట్రాక్టు , ఔట్‌సోర్సింగ్ డైలీ వేజెస్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా వాసు, కార్యదర్శిగా ముబారక్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మస్తాన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, నాయకులు సంజీవ, శీన పాల్గొన్నారు.

ప్రతిపక్షాలపై దాడుల సంస్కృతి మంచిదికాదు

–సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు మురళి

మదనపల్లె సిటీ: అధికార పార్టీకి చెందిన వారు ప్రతిపక్ష పార్టీలపై దాడులు చేసే సంస్కృతి మంచిదికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. శనివారం మదనపల్లె మండలం సీటీఎంలోని ప్రకృతివనంలో సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. సీపీఎం సీనియర్ నాయకులు కందారపు మురళి మాట్లాడుతూ పెట్టుబడిదారీ వ్యవస్థ కొద్దిమందిని మాత్రమే సంపన్నులుగా చేస్తుందన్నారు. అత్యధిక మందిని పేదరికం దారిద్ర్యంలో ముంచుతుందని మార్క్సిజం బోధించిందన్నారు. ఈ నేపథ్యంలో అసమాన వ్యవస్థను మార్చేందుకు ప్రపంచ కార్మికులంతా ఏకం కావాలని కార్ల్‌మార్క్స్ పిలుపునివ్వగా, లెనిన్ రష్యాలో అలాంటి సోషలిజాన్ని నిర్మించి మార్క్సిజం సిద్ధాంతం కాదని ఆచరణకు మార్గదర్శమని రుజువు చేశారని గుర్తు చేశారు. అదాని, అంబానీల ఆస్తులు ప్రపంచ కుబేరుల స్థాయికి పెరగగా, ప్రజలు మాత్రం ఆకలి, నిరుద్యోగంతో కునారిల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార రాజకీయ పార్టీలను మార్చడం ద్వారా సమస్యలు పరిష్కారం కావన్నారు. సమాజాన్ని సమూలంగా మార్చడమే అంతిమ పరిష్కారం అన్నారు. ఇందుకు సోషలిజమే సరైన మార్గం అని అభిప్రాయపడ్డారు. ఈ మార్గాన్ని అనుసరించడానికి, మార్క్సిజం సిద్ధాంతాన్ని లోతుగా అధ్యయనం చేయడానికి ఇది సరైన సందర్భమన్నారు. సోషలిస్టు వ్యవస్థ నిర్మించేందుకు కష్టజీవులందరూ ఐక్యం కావాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హరిశర్మ, రామచంద్ర, నాగరాజు, వెంకటయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి



కోటపల్లె పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

పీలేరు : విద్యార్థులు చదువుతోపాటు తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలని తహసీల్దార్ మహబూబ్‌బాషా అన్నారు. శనివారం స్థానిక కోటపల్లె జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 46 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 24 మంది విద్యార్థులు చర్మవ్యాధి సమస్యలతో, 22 మంది విద్యార్థులు తేలికపాటి చిరువ్యాధులతో ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని, చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన తాగునీరు తీసుకోవాలని, బయట పదార్థాలు తినరాదని తెలిపారు. ఈ కార్యకరమంలో తలపుల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ కరీముల్లా, హెచ్‌ఎం శివశంకర్, హెచ్ఈ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, కుసుమ, ఏఎన్‌ఎం భార్గవి, సీహెచ్‌వో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇవ్వండి

– ఎంపీపీ నరసింహులు



మాట్లాడుతున్న ఎంపీపీ నరసింహులు

నిమ్మనపల్లె: గ్రామాలలో మౌలిక వసతులు కల్పించేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీపీ నరసింహులు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అధికారులు తమ శాఖల త్రైమాసిక ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యం పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నీటి ట్యాంకర్లను శుభ్రపరచాలన్నారు. మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. వినాయకచవితి పండుగ సందర్భంగా మట్టి విగ్రహాలను మాత్రమే ఉపయోగించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే విగ్రహాల అమ్మకాలను ప్రభుత్వం నిషేధించినట్లు తెలిపారు. రైతులు అధిక దిగుబడులు సాధించడానికి భూసార పరీక్షలను చేయించుకోవాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మండల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలన్నారు. బాహుదా ప్రాజెక్టు కుడి కాలువ మరమ్మతు పనులు చేపట్టాలని వైస్ ఎంపీపీ జయప్రకాష్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులను కోరారు. మండల సర్వసభ్య సమావేశానికి రహదారులు, భవనాల శాఖ, సాంఘిక సంక్షేమశాఖ, ఎక్సైజు శాఖకు సంబంధించి అధికారులు గైర్హాజరు కాగా వారికి నోటీసులు ఇవ్వాల్సిందిగా ఎంపీడీఓను ఆదేశించారు. కొంత మందిఅధికారులు సమావేశానికి ఆలస్యంగా రావడంపై ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రమీలమ్మ, వైస్ ఎంపీపీలు జయప్రకాష్‌రెడ్డి, సుజాతమ్మ, ఎంపీడీఓ షాలెట్, డీటీ తపస్విని, ఏఓ మురళీమోహన్, వెటర్నరీ అధికారి రమేష్, ఈఓపీర్డీ చలపతిరావు, డాక్టర్ ప్రత్యూష, సీడీపీఓ సుజాత, ఏపీఎం రజనీకుమారి, ఏపీవో రమేష్, డాక్టర్ సురేష్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సీజన్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

మదనపల్లె: వాతావరణ మార్పులు కారణంగా సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శనివారం సాయంత్రం నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశాన్ని అధికారులతో నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో సీజనల్ వ్యాధులపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా తాగునీటి సరఫరా చేయాలన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను క్లీనింగ్ చేయించాలన్నారు. వర్షపు నీరు, మురుగునీరు నిల్వ ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మొలాథిన్ స్ప్రే చేయడం, ఫాగింగ్ చేయడం తగిన పనులు అమలు చేయాలన్నారు. వ్యాధులు వ్యాప్తిచెందిన ప్రాంతాలను ఎప్పటికప్పుడు గుర్తించి బాధితులకు వైద్య సేవలు అందించాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ నాగరాజు, మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ ఎం.ఎస్.రాజు, ఆర్ఎంఓ ప్రసాద్‌రాజు, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంపీడీఓలు భానుప్రసాద్, షాలెట్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీర్ల పండగ ఉత్సవాలు



గుర్రంకొండలో పీర్ల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండలో పీర్ల పండగ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. వారం రోజులుగా గ్రామంలోని పీర్ల చావిడ్లలో పీర్లను నిలిపి ప్రతినిత్యం ప్రార్థనలు, పూజలు నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో శనివారం స్థానిక కొత్తపేట, తాశీం వీధుల్లోని పీర్ల చావిడిళ్లలో పీర్లను రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. మేళతాళాలతో, సూలాలకు కొబ్బరి గెన్నెలను అమర్చి కాల్చుకొంటూ ఊరేగింపు సాగింది. అనంతరం పీర్ల చావిడ్ల దగ్గర పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు,జమీర్, నూర్‌అహ్మద్, జమీలా,బండ రాజు, మౌలా, గయాజ్‌లు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంట పంచాయతీలో శనివారం పీర్ల పండుగ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కుల, మతాలకు అతీతంగా ఈ నెల 24న తుమ్మరకుంట, తుమ్మరకుంటవారిపల్లిలో, 25న సామాడుపల్లి, బొమ్మిరెడ్డిపల్లి, గజ్జెలవారిపల్లిలో, 26న ఎగవ, దిగవ బండమీదపల్లి, బురదవారిపల్లిలో పీర్ల ఊరేగింపు నిర్వహించనున్నారు. 27న అన్నదాన కార్యక్రమం, 28న జలది కార్యక్రమం చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వాహనదారులందరూ హెల్మెట్ ధరించండి



ర్యాలీ నిర్వహిస్తున్న బీటీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు

మదనపల్లె సిటీ: వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని బీటీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి అన్నారు. శనివారం బీటీ కాలేజీ ఆధ్వర్యంలో శిరస్త్రాణం ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాలేజీలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆధునిక మానవ జీవితంలో యాక్సిడెంట్లు ఒక భాగమైపోయిందన్నారు. అందులో ప్రాణ నష్టం జరగడానికి హెల్మెట్లు ధరించకపోవడమే ప్రధాన కారణమన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. అనంతరం కాలేజీ మైదానంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా గడ్డి చెక్కి, చెత్తాచెదారంను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఏపీ ఆధ్యాపక సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాఘవరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శైలజ, అధ్యాపకులు శ్రీనివాసులు, చిన్నారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌ఓ కొండయ్య



మొలకలచెరువు పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య

ములకలచెరువు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పని చేస్తున్న వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ కొండయ్య సూచించారు. శనివారం ఆయన స్థానిక పీహెచ్‌సీని అకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధానంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు అయ్యేలా చూడాలన్నారు. పీహెచ్‌సీకి నిత్యం ఎంత మంది రోగులు వస్తారు.. వారికి ఎలాంటి వైద్య సేవలందిస్తున్నారని ఆరా తీశారు. గర్భిణులు, బాలింతల వివరాలు, వ్యాక్సిన్లు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తిరుగు ప్రయాణంలో చౌడసముద్రం ఔట్ రీచ్ సెషన్‌ను పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్ జాహ్నవిరెడ్డి, సిబ్బంది శంకర్, షకీలాబేగం, ఖాదర్‌బాషా, ప్రీతి, ప్రసాద్ తదితరులు ఉన్నారు.